క్లుప్తంగా

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024– 25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన సద్దల గీతిక బాసర ట్రిపుల్ ఐటీలో ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం గీతికను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవారెడ్డి, వెంకటేశ్వర్లు, గోపయ్య, అనిల్‌కుమార్, విద్యార్థిని తండ్రి సద్దల నాగరాజు తదితరులు ఉన్నారు.

టాపర్ నజ్మీన్‌కు ట్రిపుల్ ఐటీలో సీటు



నజ్మీన్

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన షేక్.రఫీ కూతురు నజ్మీన్ 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచింది. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసింది. బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఈ సందర్భంగా నజ్మీన్‌ను గ్రామ పెద్దలు, ముస్లిం మైనార్టీ పెద్దలు, తదితరులు అభినందించారు.

8న ఆలయ భూముల కౌలు వేలం

మేళ్లచెరువు : మండలంలోని రేవూరు గ్రామంలో గల శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ వ్యవసాయ భూములను సేద్యం చేసుకుంటూ కౌలు చెల్లించకుండా ఉన్న భూములకు ఈ నెల 8వ తేదీన కౌలు వేలం వేయనున్నట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి శనివారం తెలిపారు. దేవాలయ ప్రాంగణంలో నిర్వహించే ఈ కౌలు వేలం పాటలో రైతులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మోతె : మండలంలోని సిరికొండ గ్రామంలో శనివారం ఎమ్మార్పీఎస్ గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాంపాటి జానయ్య, ఉపాధ్యక్షులుగా బొర్ర సునీల్, ఏల్పుల సాయికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఉప్పల ఉప్పయ్య, కోశాధికారిగా బొర్ర గోపి, కార్యదర్శిగా ఉప్పల రామచంద్రయ్య, ప్రచార కార్యదర్శిగా ఉప్పల నాగార్జున్, సంయుక్త కార్యదర్శులుగా ఉప్పల ఎర్ర జానయ్య, వీరభద్రయ్య, ఉప్పల సందీప్, నెమలి అంజయ్యను ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా ఉప్పల వీరస్వామి, కాంపాటి వెంకన్న, ఉప్పల రంగయ్య, కాంపాటి పెద వెంకన్న, బొర్ర నర్సయ్య, నెమలి మల్లయ్య ఉన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల కార్యవర్గం ఎన్నిక

నడిగూడెం : మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రత్నవరం గ్రామానికి చెందిన మొలుగూరి సైదులు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడిగా చాకిరాలకు చెందిన మిట్టగణుపుల మోషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ యలమర్తి రాము, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి వేపూరి రాజు, జిల్లా ఎంఎస్‌ఫ్ అధ్యక్షుడు పందిటి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

రుణాలతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి



రైతులకు దీర్ఘకాలిక రుణాల చెక్కులు అందజేస్తున్న చైర్మన్ నలజాల శ్రీనివాసరావు

కోదాడరూరల్ : సహకార సంఘాలు అందజేస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని ఎర్రవరం సహకార సంఘం చైర్మన్ నలజాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఇద్దరు మహిళ రైతులకు రూ.5 లక్షల చొప్పున డైరీ, గొర్రెల ఫామ్ నిర్మాణం కోసం దీర్ఘకాలిక రుణాల చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. రైతులు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. డైరెక్టర్లు వల్లపు సుదర్శన్, సూరపల్లి మంగమ్మ, అన్నెం రవీందర్‌రెడ్డి, వెలిశమ్మ, రవినాయక్, సైదా, సిబ్బంది ఉన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

హుజూర్‌నగర్ : ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని హెచ్ఎం పీవీ రమణారావు, మున్సిపాలిటీ పర్యావరణ ఇంజనీర్ రాజశేఖర్ అన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సాగర్, ప్రియాంక, ఆశాజ్యోతి, సతీష్, రమాదేవి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.



వేణుగోపాలపురంలో నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనం



నిరుపయోగంగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ భవనం

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

నడిగూడెం : మండలంలోని వేణుగోపాలపురంలో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని 15 ఏళ్ల క్రితం దాదాపు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించారు. గత ఏడాది వరకు ఆ భవనంలో విధులు నిర్వహించారు. గ్రామంలో పల్లె దవాఖానకు భవనం నిర్మించడంతో గత ఏడాది కాలంగా పాత భవనం నిరుపయోగంగా ఉంటోంది. అలాగే గ్రామంలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో పదేళ్ల కిందట నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనం నిర్మించిన నాటి నుంచి నిరుపయోగంగానే ఉంటుంది. ప్రస్తుతం తలుపులు, కిటికీలు దెబ్బతినడంతో భవనం శిథిలావస్థకు చేరింది. ఈ రెండు భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ప్రభుత్వ అధికారులు స్పందించి భవనాలను ఉపయోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సింగిల్ విండో పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



నూతన చైర్మన్ పెండెం ముత్యాలుగౌడ్, పాలకవర్గ సభ్యులు

గరిడేపల్లి : మండలంలోని సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తాత్కాలిక పాలకవర్గం శనివారం బాధ్యతలు స్వీకరించింది. ప్రస్తుతం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కమల ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ సభ్యులు బాధ్యతలు చేపట్టారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సింగిల్ విండోకు తాత్కాలిక పాలకవర్గాన్ని నియమిస్తున్నట్లు జిల్లా సహకార సంఘం అధికారి పద్మ ప్రత్యేక ఆదేశాలతో కూడిన ఉత్తర్వులను అందజేశారు. దీని ఆధారంగా నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. సంఘం చైర్మన్‌గా ముత్యాలుగౌడ్, వైస్ చైర్మన్‌గా గుమ్మడవెల్లి కృష్ణకుమారి, సభ్యులుగా దొంతగాని ఎల్లయ్య, మీసాల యోహాన్, మూలగుండ్ల సుధాకర్‌రెడ్డి, కొత్త చంద్రారెడ్డి, ఎడవెల్లి వెంకటరెడ్డి, పెండెం కోటేశ్వరరావు, గట్టికొప్పుల లక్ష్మారెడ్డి, బాణోతు రమేష్‌లు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ పెండెం ముత్యాలుగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతులకు సేవలందిస్తానని, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పైడిమర్రి రంగనాథ్, ఆశా రమేష్, సీతారామరెడ్డి, రామాంజీగౌడ్, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, సహకార సంఘం కార్యదర్శి గోపి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జానకీనగర్‌లో ఉద్రిక్తత

మరోమారు నిలిచిన డొంక భూమి సర్వే

- గ్రామంలో ఆక్రమణలన్నీ సర్వే చేయాలని ఓ వర్గం.. డొంక సర్వే చేపట్టాలని మరోవర్గం వాదన
- చర్చలు విఫలమై వెనుదిరిగిన సర్వే, రెవెన్యూ అధికారులు
- ఒంటిపై పెట్రోల్ పోసుకొని తహసీల్దార్ కారుకు అడ్డుగా ఓ వ్యక్తి ఆందోళన
- భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు



తహసీల్దార్ కారుకు అడ్డంగా కూర్చొని ఆందోళన చేస్తున్న ఒంటిపై పెట్రోల్ పోసుకున్న వ్యక్తి, తదితరులు



సర్వేకు వచ్చిన అధికారులతో మాట్లాడుతున్న రైతులు

చిలుకూరు : మండలంలోని జానకీనగర్‌లో శనివారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామంలో గత కొంత కాలంగా వివాదాస్పదంగా మారిన డొంక దారి భూమిని సర్వే చేసేందుకు సర్వే అధికారులు గ్రామానికి రాగా అక్కడ రెండు వర్గాలుగా ఉన్న రైతుల మధ్య సమన్వయం లేకపోవడంతో మళ్లీ సర్వే నిలిచింది. గ్రామంలో ఆక్రమణకు గురైన భూములన్నింటితో పాటు డొండ దారి భూమి సర్వే చేయాలని ఓ వర్గం రైతులు కోరగా, డొంక దారి సర్వే ఇప్పుడే పూర్తి చేయాలని మరో వర్గం వారు డిమాండ్ చేశారు. దీంతో అధికారులకు ఇరువర్గాల మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది.

రెండు వర్గాలుగా రైతులు..

కాగా, జానకీనగర్‌లో డొంకదారి భూమి వివాదం కొన్నాళ్లుగా సాగుతోంది. ఇంతకుముందే ఓ సారి సర్వేకు వచ్చిన అధికారులు అక్కడి రైతుల మధ్య సమన్వయం లేకపోవడంతో సర్వే చేయకుండా వెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మరోసారి సర్వే చేసేందుకు ముందస్తుగా రైతులకు నోటీసులు జారీ చేసి పోలీసు బందోబస్తుతో వచ్చారు. ఇరువర్గాలకు చెందిన రైతులు కూడా అక్కడకు వచ్చారు. దీంతో అక్కడకు వచ్చిన ఓ వర్గం వారు.. గ్రామంలో భూములు ఆక్రమణకు గురయ్యాయని దరఖాస్తులు ఇచ్చామని మొత్తం ఒకేసారి సర్వే చేయాలని సర్వే అధికారులతో వాగ్వాదానికి దిగారు. మరోవర్గం రైతులు డొంక భూమిని వెంటనే సర్వే చేయాలని కోరారు. ఈ విషయమై ఇరు వర్గాల రైతులతో అధికారులు చాలాసేపు చర్చలు జరిపినా ఫలించలేదు. దీంతో అధికారులు సర్వే చేయకుండా వెనుదిరిగారు.

ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆందోళన..

అయితే సర్వే, రెవెన్యూ అధికారులు అక్కడి నుంచి వెళ్తుండగా.. డొంక సర్వే చేశాకే వెళ్లాలని ఒక వర్గం వారు తహసీల్దార్ కారుకు అడ్డంగా కూర్చొని ఆందోళనకు దిగారు. అందులో ఓ రైతు భట్టు అమృనాయక్ ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. జిల్లా అధికారులతో మాట్లాడి మరోమారు పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చిలుకూరు ఎస్‌ఐ సురభి రాంబాబుగౌడ్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ధృవకుమార్, డీఐఓలు వంశీధర్, మంచ్యానాయక్, మండల సర్వేయర్ నాగార్జున్‌రెడ్డి, ఆర్ఐలు శ్వేత, మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



ఎత్తిపోతల పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించి మాట్లాడుతున్న వెంకటరెడ్డి

మునగాల : మండల కేంద్రం శివారులో సాగర్ ఎడమకాలువపై గల ఎల్–33 ఎత్తిపోతల పథకం వద్ద చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి కోరారు. శనివారం ఎత్తిపోతల పథకం వద్ద చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన రైతులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గత వేసవిలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్‌వైర్‌తో పాటు ఆయిల్‌ను చోరీ చేశారని, నాటి నుంచి నేటి వరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయలేదని తెలిపారు. ప్రస్తుతం వానాకాలం సాగు సీజన్ ప్రారంభమవుతున్నందున మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని కోరారు. ఆయన వెంట రైతులు ఉప్పుల చిన కృష్ణారెడ్డి, కిన్నెర వెంకన్న, గడ్డం వినోద్, దాసరి శ్రీను, కోదాటి శంకర్ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరేడుచర్ల : వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేరేడుచర్ల మున్సిపాలిటీలో శనివారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు, మెప్మా సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

టీజీపీఎస్సీలో లోపాలు సరిచేయాలి

మునగాల : టీజీపీఎస్సీలో లోపాలను సరిచేయాలని మండలానికి చెందిన న్యాయవాది మిర్యాల మంగయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఈ మెయిల్ ద్వారా లేఖ పంపారు. ఈ సందర్భంగా ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ.. టీజీపీఎస్సీ సంస్థ నిర్వహించిన పలు పరీక్షల్లో అనేక లోపాలుండడంతో హైకోర్టులో పలువురు కేసులు వేసినట్లు తెలిపారు. ఒక సంవత్సరంలో పరీక్షలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు చేయాల్సి ఉండగా, సకాలంలో నియామకాలు జరగకపోవడంతో అభ్యర్థులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. టీజీపీఎస్సీని రద్దు చేసి.. దేశవ్యాప్తంగా పరీక్షలు నిర్వహించి ఉద్యోగ నియామకాలు సమర్థవంతగా పూర్తిచేసే యూపీఎస్సీ సంస్థకు బాధ్యతలు అప్పగించాలని కోరారు.

కనుల పండువగా బోనాల పండుగ



బోనాలతో ఆలయానికి ప్రదర్శనగా వెళ్తున్న భక్తులు

మునగాల : మండల కేంద్రంలో శనివారం ముదిరాజ్ మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి బోనాల పండుగను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మతల్లికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ చింతకాయల ఉపేందర్, మత్స్య సహకార సంఘం చైర్మన్ పిట్టల శ్రీను, కార్యదర్శి వేట శివాజీ, కార్యవర్గ సభ్యులు కంటు శ్రీను, చింతకాయల సైదులు, చింతకాయల నాగరాజు, చింతకాయల రమేష్, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం



హుజూర్‌నగర్ : సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు



నేరేడుచర్ల : మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు ఆరోపించారు. శనివారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్మారక భవనంలో అఖిలపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలభారత రైతు సంఘం నాయకులు పోటు లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.హుస్సేన్ తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు మురళి, యోన, ఉదయగిరి, వీరబాబు, పాశం వీరబాబు, అబ్బురం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

గరిడేపల్లి : నరేంద్రమోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు షేక్ యాకూబ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెస్ భవన్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు కీసర నాగయ్య అధ్యక్షతన జరిగిన ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సీపీఎం మండల కమిటీ సభ్యులు దోసపాటి భిక్షం, బొల్లేపల్లి శ్రీనివాస్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బెజ్జం రమేష్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పంగ సైదులు, మండల కార్యవర్గ సభ్యులు కుందూరు వెంకటరెడ్డి, ప్రతాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

గరిడేపల్లి : ఈ నెల 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షుడు మేకల కనకారావు కోరారు. శనివారం మండలంలోని వెలిదండ గ్రామంలో నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం సీనియర్ నాయకులు మాశెట్టి అంజయ్య, పెద్ద సాంబయ్య, చామకూరి వెంకటయ్య, కారింగుల బ్రహ్మయ్య, వల్లపుదాసు వెంకటయ్య, రాములు, రమేష్, అంబటి వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

నేరేడుచర్ల : ఈనెల 9వ తేదీన నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ హుస్సేన్ కోరారు. శనివారం నేరేడుచర్లలో సమ్మె వాల్ పోస్టర్‌ను టీయూసీఐ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు రజాక్, బైరం ఆనంద్, దేవయ్య, లక్ష్మయ్య, నాశయ్య, రంగయ్య, శాంతయ్య, విజయ్ తదితరులు ఉన్నారు.

మఠంపల్లిలో కరపత్రం ఆవిష్కరణ

మఠంపల్లి : నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా ఈనెల 9న నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రస్‌మియా కోరారు. శనివారం మఠంపల్లిలో హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మండల తుపాకుల గురువయ్య, పాతకోటి ప్రకాష్, నందిపాటి నాగరాజు, సత్తార్ శివ, ఆరాల వెంకటేశ్వర్లు, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ అందజేత

నేరేడుచర్ల : ఈనెల 9వ తేదీన సార్వత్రిక సమ్మె నేపథ్యంలో శనివారం నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ రామ్మూర్తి మాట్లాడుతూ సమ్మెకు పారిశుద్ధ్య కార్మికులు మద్దతు ప్రకటించి సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు జానీ, రాములు, కొండలు తదితరులు ఉన్నారు.

సర్వారం సహకార సంఘం చైర్మన్ ఎన్నిక తీరు హాస్యాస్పదం

గరిడేపల్లి : సర్వారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎన్నిక నిర్వహించిన తీరు హాస్యాస్పదమని మాజీ చైర్మన్ వీరంరెడ్డి శంబిరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో రెండుసార్లు అవిశ్వాస తీర్మానం పెట్టినా తానే నెగ్గానని తెలిపారు. రాజీనామా చేసిన డైరెక్టర్లను తిరిగి ఎన్నిక చేయటం హాస్యాస్పదమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణనాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల, వెంకటరమణారెడ్డి, గీత, జ్యోతి, రామారావు, ముత్తమ్మ, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

బతుకమ్మ గార్డెన్ స్థలం అన్యాక్రాంతం కానివ్వొద్దు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఊరచెరువు వద్ద ఉన్న బతుకమ్మ గార్డెన్ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ నాయకులు కోరారు. శనివారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. బతుకమ్మ గార్డెన్ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ విషయమై అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.శ్రీను, వెంకన్న, మల్లయ్య, సీతారాములు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

మునగాల : మండలంలోని కలకోవలో గల సీపీఎం భవనంలో శనివారం కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు, గ్రామపెద్దలు మండవ వెంకటాద్రి, కాసాని ముత్తయ్య, కొంపెల్లి లింగయ్య, వీరభద్రం, యువకులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలని వినతి

హుజూర్‌నగర్ : కళాకారుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవీంద్ర భారతి డైరెక్టర్ మామిడి హరికృష్ణకు జానపద కళల పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూర్‌నగర్ : పట్టణంలోని మాధవరాయినిగూడెంకు చెందిన చింతలచెరువు లావణ్య, మంచాల శివకృష్ణ, మోదాల కవితా, చింతల చెరువు లింగయ్యకు మంజూరైన రూ.2,52,500 విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్ లబ్ధిదారులకు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మోదాల సైదులు, శ్రీనివాస్, వెంకన్న, సావిత్రి, సైదులు, సంజీవరావు పాల్గొన్నారు.

మట్టపల్లిలో గరుడ వాహన సేవ



గరుడవాహనంపై ఊరేగుతున్న స్వామి వారు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మి,చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహుడికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం, నూతన పట్టు వస్త్రాలంకరణ చేపట్టారు. నిత్యకల్యాణంలో భాగంగా ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం రక్తిగట్టించారు. అదే విధంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఋత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. శ్రీస్వామివారిని గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో భక్తులు ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ సిరికొండ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు ఇవ్వాలి

మునగాల: సర్వశిక్ష అభియాన్‌లో భాగంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో వేతనాలు మంజూరు చేయాలని ఆ సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాంపంగు వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మునగాల మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది సమ్మె కాలానికి సంబంధించిన ఒక నెల వేతనం నేటికీ అందలేదని, అదే విధంగా ప్రస్తుతం రెండునెలలుగా వేతనాలు అందక కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కాంట్రాక్టు ఉద్యోగులకు పేస్కేలు అమలు చేసి ప్రతినెలా ఒకటవ తేదీన వేతానాలు ఇవ్వాలని కోరారు.

కిసాన్ సెల్ నాయకుడి మృతి

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ సీనియర్ నాయకుడు తిప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (80) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ నేలమర్రి వెంకటమ్మ, ఉపాధ్యక్షుడు అల్వాల రామారావు, నాయకులు తప్పిరెడ్డి కోటిరెడ్డి, మారిశెట్టి నర్సింహారావు, ఏనుగుల వీరాంజనేయులు, పొన్నం యేసయ్య, బారి వెంకన్న, తదితరులు నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : పట్టణంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగిస్తున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్, రెడ్డి బజార్, తిలక్ నగర్, గాంధీ పార్క్ ఏరియా, శ్రీనగర్ కాలనీ, పీర్ల కొట్టం ప్రాంతం, లింగగిరి రోడ్డు, ఎన్ఎస్‌పీ క్యాంప్, గోవిందపురం ఏరియాల్లో ఉదయం ఆదివారం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

దొరకుంట సబ్‌స్టేషన్ పరిధిలో..

కోదాడరూరల్ : మండలంలోని దొరకుంట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఎస్‌కె. సైదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ, వ్యవసాయ, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పాటులో భాగంగా విద్యుత్ పనులు చేపడుతున్నందున పాత నేరేడుచర్ల రోడ్డులో గల వేంకటేశ్వరస్వామి గుడి వద్ద యారవ శ్రీనివాస్ ఇంటి బజారులో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నేరేడుచర్ల ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ పందిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సాయిమందిరానికి విరాళం

మునగాల : మండల కేంద్రం శివారులోని శ్రీహరిహరసుత అయ్యప్ప దేవాలయం ఆవరణలో గల శ్రీషిరీసాయి మందిరంలో నిత్య దూపదీప, నైవేద్యానికి నర్సింహులగూడెంకు చెందిన జూలకంటి వెంకటేశ్వర్లు –నాగలక్ష్మి దంపతుల కుటుంబం రూ.75వేల విరాళం ఇచ్చారు. శనివారం నగదు చెక్కును సాయి మందిరం వ్యవస్థాపకుడు దేవినేని సీతారామయ్య, నిర్వాహకులు రవికుమార్‌కు వారు అందజేశారు.

వీరస్వామి ఎన్నిక హర్షణీయం



వీరస్వామిని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గరిడేపల్లి : తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోట వీరస్వామి ఎన్నికైన సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ బాబు మాదిగ ఆధ్వర్యంలో శనివారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వీరస్వామి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మల్లయ్య, అరుణ్, రవి, కుర్రి వెంకన్న, సతీష్, దుర్గయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.